సమాజాభివృద్ధి ప్రతి ఒక్కరి కర్తవ్యం

- ఒక్క ప్రభుత్వమే చేయలేదు
- భద్రాద్రి రాముడిని దర్శించుకున్న రాష్ట్రపతి
- సమ్మక్క సారలమ్మ పూజారులతో సమ్మేళనం



సమ్మక్క సారలమ్మ పూజారులతో సమ్మేళనంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు చదువుపై మనసు లగ్నం చేయాలని, చదువు పూర్తై స్వావలంబన సాధించాక తిరిగి సమాజ పురోగతికి దోహదం చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధించారు. చిన్నారులదే దేశ భవిష్యత్తు అని చెప్పారు. సమాజ పురోగతి బాధ్యత ప్రభుత్వానిదో లేక సంబంధిత సంస్థలదో మాత్రమే కాదనీ, అది ప్రతి ఒక్కరి కర్తవ్యం అని చెప్పారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం భద్రాచలం క్షేత్ర పర్యటన చేశారు. తొలుత హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం వెళ్లిన ఆమె అక్కడి నుంచి బూర్గంపాడు మండలం సారపాక వరకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో వచ్చారు. అనంతరం కాన్వాయ్ ద్వారా భద్రాచలం చేరుకున్నారు. తొలుత శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో రాష్ట్ర గవర్నర్ తమిళి సైతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రసాద్ పథకం పనుల శిలాఫలకంను ఆమె ఆవిష్కరించారు. అనంతరం వీరభద్ర కళ్యాణ మండపానికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ గిరిజన పూజారుల సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో విద్యా సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను రాష్ట్రపతి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలుత తెలుగులో అందరికీ నమస్కారం అని అభివాదం చేసి అందర్నీ ఆశ్చర్య పరిచారు. ప్రముఖ కవి దాశరధి రాసిన – నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే కవితను ప్రస్తావించారు. తెలంగాణలో మొదటిసారి చేస్తున్న పర్యటనలో ఆలయాల్లో దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించే అవకాశం లభించిందని అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రసాద్ పథకం ద్వారా దేవాలయాల్లో చేపడుతున్న సౌకర్యాల మెరుగుదలతో దేశ, విదేశీ యాత్రికుల తీర్థ యాత్రలకు వచ్చే అవకాశాలు పెరుగుతాయని, దాంతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభ సంతరిల్లుతుందన్నారు. తెలంగాణ వనవాసీ పరిషత్ ద్వారా గిరిజన సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు జరుగుతున్న కృషిని కొనియాడారు. సమ్మక్క సారలమ్మ లాంటి జాతరలు సమాజ మూల విలువలను పటిష్టం చేస్తాయని చెప్పారు. అన్ని ప్రగతి రంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం ఉండాలని, గిరిజన మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మరిన్ని చర్యలు అవసరమని తెలిపారు.

గిరిజన సంక్షేమానికి చర్యలు : మంత్రి సత్యవతి రాథోడ్

గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్టు మంత్రి తెలిపారు. గిరిజన విద్య, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు పలు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 23 ఏకలవ్య పాఠశాలలు నడుస్తున్నాయని, 33 బాలికల గురుకుల పాఠశాలలు, 183 గురుకుల పాఠశాలలు, 332 ఆశ్రమ, 24 మినీ గురుకులాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. విదేశాల్లో చదువుకునే వారికి అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా రూ.20 లక్షల సహాయం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. మేడారం, నాగోబా జాతరలను రాష్ట్ర జాతరలుగా గుర్తించామన్నారు. 3,146 గిరిజన ఆవాసాలను గుర్తించి గ్రామ పంచాయతీలుగా మార్చి, గిరిజన బిడ్డలకు పాలించే అధికారం కల్పించామన్నారు. మారుమూల ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ముందస్తు అరెస్టులు

భద్రాచలం ఏజెన్సీలో రాష్ట్రపతి పర్యటన ప్రశాంతంగా ముగియటంతో అధికార యంత్రాంగం అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రాచలం ఏజెన్సీలో పలువురు రాజకీయ పార్టీ నాయకులను, కుల సంఘాల నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సంఘటనపై పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి జి కిషన్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, భద్రాద్రి కొత్తగూడెం జెడ్‌పి చైర్మెన్ కోరం కనకయ్య, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు పోదెం వీరయ్య, రేగా కాంతారావు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల సెక్రటరీ రోనాల్డ్ రాస్, డిఐజి నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్‌పి డా వినీత్, ఐటిడిఎ పిఒ గౌతమ్ పోట్రూ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3నుంచి టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ మూడు నుంచి పది పరీక్షలు నిర్వహించనున్నట్టు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ ఏడాది నుంచి ఆరుపేపర్లతో, వందశాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వ్యాసరూప ప్రశ్నలకు మాత్రమే ఇంటర్నరల్ ఛాయిస్ ఉంటుందని, సూక్ష్మ రూప ప్రశ్నలకు ఛాయిస్ లేదన్నారు. నమూనా ప్రశ్న పత్రాలను వెంటనే విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించా లన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా బోధించాలని ఆదేశించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించా లన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణతా శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి 9, 10 తరగతులకు ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో సబ్జెక్ట్‌లో పరీక్షలకు 80, ఫార్మెటివ్ అసెస్‌మెంట్‌కు 20 మార్కులు కేటాయిస్తు న్నట్లు తెలిపింది. సైన్స్ పేపర్‌లో ఫిజిక్స్, బయోలజీకి చెరి సగం మార్కులు ఉంటాయి. సైన్స్ పరీక్షకు 3.20 నిమిషాల సమయం కేటాయించగా.. మిగతా అన్ని సబ్జెక్టులకు మూడు గంటలు పరీక్షా సమయం ఉంటుంది.

హైదరాబాద్‌లో తొలి వాక్ ఇన్ స్టోర్

బిగ్ బాస్కెట్ వెల్లడి

హైదరాబాద్ : టాటా గ్రూపునకు చెందిన బిగ్ బాస్కెట్ తన వాక్ ఇన్ స్టోర్‌ను హైదరాబాద్‌లోని మణికొండలో ప్రారంభించింది. ఈ సెల్ఫ్ సర్వీస్ స్టోర్‌లో 4వేలకు పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. వీటిలో వ్యక్తిగత సంరక్షణ, బ్రాండెడ్ ఫుడ్స్, బేవరేజస్, కిచెన్‌వేర్, బేబీకేర్‌తోపాటుగా పండ్లు, కూరగాయలు, గ్రోసరీ ఉంటాయని బిగ్‌బాస్కెట్ కో ఫౌండర్ విఎస్ సుధాకర్ తెలిపారు. సూపర్‌మార్కెట్‌లకు ధీటుగా ఉండే బిగ్‌బాస్కెట్ స్టోర్ స్థానిక మార్కెట్‌లతో పోలిస్తే అతి తక్కువ ధరలకు వస్తువులను అందిస్తోందన్నారు.

ఇన్నోవా హైక్రాస్ ధర రూ.18.30 లక్షలు

బెంగళూరు : టోయటో కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఎంతో కాలంగా వేచి చూస్తోన్న తన న్యూ ఇన్నోవా హైక్రాస్ ధరలను ఎట్టకేలకు ప్రకటించింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ధరల శ్రేణిని రూ.18.30 లక్షల నంచి రూ.28.97 లక్షలుగా నిర్ణయించింది. గత నవంబర్‌లోనే ఈ వాహనాన్ని ఆవిష్కరించడంతో పాటుగా బుకింగ్స్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఎనిమిది వేరియంట్లలో ఆవిష్కరించింది. హైబ్రిడ్ ఎలక్ట్రిక్ సిస్టమ్‌తో అందుబాటులోకి తెస్తున్న టిఎన్‌జిఎ 2.0 లీటర్ 4- సిలీండర్ గ్యాసోలైన్ ఇంజిన్ వాహనం లీటర్‌కు 23.24 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది.



ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

జనవరి 6-9 వరకు కేరళలో ఐద్వా అఖిలభారత మహాసభ

- చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 13వ మహాసభ జనవరి 6-9 వరకు కేరళలోని త్రివేంద్రంలో జరగనుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డికొమరయ్య భవనంలో బుధవారం ఐద్వా సమావేశం జిల్లా అధ్యక్షులు పోలబోయిన వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ఆ మహాసభలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మహిళలకు భద్రత కల్పించాలని, 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే వాటిపై చర్చించి పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. ఈ సమస్యలపై గ్రామస్థాయిలో మహిళలను చైతన్యం చేసి ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ, పట్టణ స్థాయిల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యలో, క్రీడలలో, రాజకీయంగా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు పోతున్న మహిళల పట్ల వివక్ష, అణచివేత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల అవుతున్నా సమాన పనికి సమాన వేతనం అందని పరిస్థితి ఉందని, ఇల్లు లేని పేదలు చాలామంది ఉన్నారని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పొదుపు గ్రూప్‌లలో ఉన్న 45 శాతం మంది మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, మాదకద్రవ్యాలు, ఫోర్న్‌వెబ్‌సైట్లను, అశ్లీల సాహిత్యాన్ని నిషేధించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు జిట్ట సరోజా, నిమ్మల పద్మ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి సిరిసిల్ల రాజేశ్వరి మృతి

- కాళ్లతో కవితలు రాసిన ప్రతిభాశాలి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో



రాజేశ్వరి (ఫైల్ ఫోటో)

వైకల్యాన్ని అధిగమించి.. ఆత్మవిశ్వాసంతో కాళ్లనే చేతులుగా మలుచుకుని అక్షరాలు నేర్చుకుని కవితలు రాసిన 'సిరిసిల్ల' రాజేశ్వరి అనారోగ్యంతో మృతిచెందారు. సిరిసిల్ల జిల్లాకు అరుదైన గౌరవం తెచ్చిపెట్టిన కవయిత్రి బూర రాజేశ్వరి అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మండేపల్లిలో మరణించారు. పేద నేతన్న కుటుంబంలో ఆమె జన్మించారు. అయితే, ఆమె నడవలేకపోయినా.. తన వైకల్యాన్ని తలచుకుని ఏనాడూ బాధపడలేదు. తన కవితలతో సిరిసిల్ల రాజేశ్వరిగా పేరుగాంచారు. సుద్దాల హనుమంతు- జానకమ్మ పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని సుద్దాల అశోక్ తేజ రాజేశ్వరికి బహుకరించారు. రాజేశ్వరి కవితలను పుస్తకంగా తీసుకొచ్చి.. ఆవిష్కరించారు. ఆమె విషయం సిఎం కెసిఆర్ దృష్టికి వెళ్లడంతో ఆర్థిక సహకారం అందజేశారు. పింఛన్ మంజూరు చేశారు. 42 ఏళ్ల వయసులో అనారోగ్యానికి గురైన ఆమె చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. ఆమె మరణం సాహితీ లోకానికి తీరని లోటు. ఆమె జీవిత ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకం. సిరిసిల్లకు చెందిన ప్రతిభావంతులైన రచయిత్రి రాజేశ్వరిని అభినందిస్తూ గతంలో మంత్రి తారక రామారావు ట్వీట్ చేశారు. మహారాష్ట్రలో పాఠ్యాంశాల్లో బూర రాజేశ్వరి జీవితాన్ని పాఠంగా చేర్చారని, తెలంగాణ రాష్ట్రంలోనూ రాజేశ్వరి స్ఫూర్తిదాయక స్టోరీని విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధించాలని విద్యాశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఆమె మృతిపట్ల మంత్రి సంతాపం తెలిపారు.

ఎయిర్‌పోర్టు మెట్రో పనులకు ఐదు కన్సార్షియంల అర్హత

- హెచ్‌ఎఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ పనులకు సంబంధించి ఐదు కన్సార్షియంలు అర్హత సాధించాయి. మెట్రో కారిడార్ రూట్‌మ్యాప్ పరిశీలించిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు కొద్దిరోజుల కిందట జనరల్ కన్సల్టెంట్‌లను (జిసి) ఆహ్వానించిన సంగతి తెలిసిందే. మొత్తం 31 కిలోమీటర్ల దూరం పనులను అత్యంత అధునాతన పద్ధతిలో చేపట్టేందుకుగాను ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలను ఆహ్వానించగా.. ఈ మేరకు వివిధ దేశాల్లోని 13 ప్రతిష్టాత్మక అంతర్జాతీయ, జాతీయ కంపెనీలు బిడ్‌లు దాఖలు చేశాయి. ఆయా సంస్థల సామర్థ్యాన్ని, నైపుణ్యతను పరిశీలించిన హెచ్‌ఎఎంఎల్ అధికారులు ఐదు కన్సార్షియంలను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆ కంపెనీలు పనుల నిర్వహణకు అర్హత సాధించినట్టు హెచ్‌ఎఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. ప్రతిపాదన కోసం అభ్యర్థన (ఆర్‌ఎఫ్‌పి) పత్రాలైన తదుపరి దశ బిడ్ పత్రాలు కన్సార్షియమ్‌లన్నింటికీ జారీ చేస్తామని, వారు తమ బిడ్‌లను వచ్చే నెల 20లోపు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

అర్హత సాధించిన కన్సార్షియంలు ఇవే..

- ఎఇకామ్ ఇండియా, ఈజిస్ రెయిల్(ఫ్రాన్స్), ఈజిస్ ఇండియా
- ఆయేసా ఇంజనెర్సియా వై ఆర్కెటెక్ట్రా (స్పెయిన్), ఆర్‌వి అసోసియేట్స్, నిప్పాన్ కోయి (జపాన్),
- కన్సల్టింగ్ ఇంజినీర్స్ గ్రూప్, కొరియా నేషనల్ రైల్వే(సౌత్ కొరియా)
- సిస్ట్రా(ఫ్రాన్స్), ఆర్‌ఐటీఈఎస్, డీబీ ఇంజినీరింగ్ అండ్ కన్సల్టింగ్(జర్మనీ).
- టెక్నికా వై ప్రోయెక్టోస్(స్పెయిన్), పీనీ గ్రూప్ (స్విట్జర్లాండ్).

మూడేళ్లలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం

- రూ.700 కోట్ల వ్యయం
- పనులను పర్యవేక్షించిన రైల్వే సహాయ మంత్రి దర్శన జర్దోష్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను వచ్చే 40 ఏండ్ల అవసరాలకు అనుగుణంగా రూ.700 కోట్లతో పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్టు రైల్వే, జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, డివిజనల్ రైల్వే మేనేజర్ ఏకే గుప్తా, ఇతర సీనియర్ రైల్వే అధికారులతో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పనులను ఆమె బుధవారం తనిఖీ చేశారు. 10వ నెంబర్ ప్లాట్ ఫామ్ ప్రవేశ మార్గం వద్ద మొక్కలు నాటారు. ఈ ప్రాజెక్ట్ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన కాలపరిమితిలోగా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడే ప్యాసింజర్ వెయిటింగ్ హాల్‌ను తనిఖీ చేశారు. ప్రయాణీకులతో మాట్లాడి స్టేషన్‌లోని సౌకర్యాలపై ఆరా తీశారు. జనపనారతో తయారు చేసిన బ్యాగ్‌లు, చేనేత, కలంకారి వస్త్ర ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్‌ను ఆమె సందర్శించారు. మార్కెటింగ్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌తోపాటు స్టేషన్ బయటి ఆవరణ, పార్కింగ్ ఏరియా సహా పలు ప్రాంతాల్లో కలియతిరిగారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ప్రయాణీకులకు అసౌకర్యం కలగకుండా పనులను కొనసాగించాలని చెప్పారు. అనంతరం రైల్ నిలయం సమావేశ మందిరంలో ఆయా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఇథనాల్ కంపెనీ ప్రజా వ్యతిరేక చర్యలు మానుకోవాలి

- సిపిఐ(ఎం.ఎల్) రెవల్యూషనరీ ఇన్షేటివ్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

నారాయణ పేట మరికల్ మండలం చిత్తనూర్ గ్రామంలోని ఇథనాల్ కంపెనీ ప్రజా వ్యతి రేక చర్యలు మానుకోవాలని సిపిఐ(ఎంఎల్) ఇన్షేటీవ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల వ్యవసాయ భూములు, సాగునీటి పైపుల ధ్వంసం చేస్తున్న ఆ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ, పరిసర గ్రామాల రైతుల పోరాటాన్ని బలపర్చాలని రైతులకు పిలుపునిచ్చారు. వేలాది మంది రైతుల సాగునీటి పైపులను ధ్వంసం చేయడాన్ని మానుకోవాలని తెలిపారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాతావరణ కాలుష్యం కావటం వల్ల 20, 30 గ్రామాల ప్రజల ఆరోగ్యాలు అగమ్య గోచరంగా మారాయని తెలిపారు.

పునరుత్పాదక ఇంధనంలో రికార్డు

- చతికిలపడిన బిజెపి పాలిత రాష్ట్రాలు
- రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

పునరుత్పాదక ఇంధనం (రెనవబుల్ ఎనర్జీ)లో తెలంగాణ రాష్ట్రం రికార్డులను అధిగమించిందని రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల మెగావాట్ల టార్గెట్ ఇవ్వగా ఈ ఏడాది వరకు రాష్ట్రంలో 5078.73 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్టు తెలిపారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికన్నా 254 శాతం అదనంగా ఉత్పత్తిని సాధించామన్నారు. ఈ విషయంలో బిజెపి పాలిత రాష్ట్రాలు లక్ష్యాలు సాధించలేక చతికిలబడ్డాయని విమర్శించారు. గుజరాత్ 108 శాతం, కర్ణాటక 110 శాతం మాత్రమే అదనంగా ఉత్పత్తి చేశామన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర బిజెపి పాలిత రాష్ట్రాలు పునరుత్పాదక ఇంధనంలో పూర్తిగా వెనకబడి పోయాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే దేశంలో కర్బన ఉద్గారాలు తగ్గించే లక్ష్యంతో ముందుకెళ్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, జగదీశ్‌రెడ్డి కృషికి ధన్యవాదాలు తెలిపారు.

కష్టజీవులారా..! ఖమ్మం పోదాం..!!

- నేడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బహిరంగసభ
- హాజరుకానున్న కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్
- నగరంలో రెపరెపలాడుతున్న ఎర్రజెండాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"పోదాం రారో.. వ్యవసాయ కూలీల మహాసభలకు ఊరూవాడ పిల్లాజెల్ల వేలాదిగా తరలుతున్నరు.. సాయుధ పోరు అడ్డమీద సమరానికి సయ్యంటూ.. పోరు గడ్డ ఖమ్మానికి తరలివస్తున్నరంట..!" సుందరయ్య చూపిన బాటలో కూలీ రైతు చెమట చుక్క బతుకు మెతుకు అయ్యి.. సంఘటితంగా ఖమ్మానికి కదిలింది.. పూర్వవైభవం దిశగా ఎర్రజెండా వేస్తున్న అడుగుకు బాసటగా నిలిచేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే బహిరంగసభకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. మాజీ ఎంపి, మాజీ ఎమ్మెల్యే తమ్మినేని వీరభద్రం పాల్గొననున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఖమ్మం పెవిలియన్‌గ్రౌండ్ నుంచి మహాప్రదర్శన ప్రారంభమవుతుంది. ఈ సభ నేపథ్యంలో ఖమ్మం ఎరుపుమయమయింది. ఎటుచూసినా అరుణ తోరణాలు, ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఈ బహిరంగసభకు లక్షలాదిగా తరలాలని సంఘం నేతలు పిలుపునిచ్చారు. దానికి తగిన విధంగా సభా స్థలిని సిద్ధం చేశారు. సభా ఏర్పాట్లను



ఖమ్మం జిల్లాలో ఎర్ర జెండాలతో రెపరెపలాడిన దృశ్యం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం బుధవారం పరిశీలించారు. ఖమ్మం ఎసిపి ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు మధ్యాహ్నం 3 గంటలలోపు మాత్రమే నగరంలోకి అనుమతిస్తారు. బహిరంగసభ అనంతరం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రారంభం కానున్న మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 700 మంది ప్రతినిధులను ఆహ్వానించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌రాఘవన్, బి వెంకట్ ఈ మహాసభల్లో ప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు.

రూట్‌మ్యాప్ ఇదే...

- కోదాడ మార్గంలో నేలకొండపల్లి, ముదిగొండ నుంచి వచ్చే వాహనాలు వెంకటగిరి క్రాస్‌రోడ్డు మీదుగా ప్రకాశ్‌నగర్, బోస్‌సెంటర్ మీదుగా ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సభకు వచ్చేవారిని దించాలి. తిరిగి ఆ వాహనాలు చర్చి కాంపౌండ్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లి మమతా రోడ్డు లకారం పార్కు పక్కన ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేయాలి.
- మధిర నియోజకవర్గం మొత్తం బోనకల్ రోడ్డులో అగ్రహారం బ్రిడ్జి, ముస్తఫానగర్, చర్చికాంపౌండ్ ఫ్లైఓవర్ మీదుగా వచ్చి అర్బన్ తహశీల్దార్ ఆఫీస్ వద్ద ప్రయాణీకులను దించి తిరిగి పీఎస్‌ఆర్ రోడ్డు, చర్చికాంపౌండ్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లి లకారం పార్కు వద్ద ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేయాలి.
- అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి, ఇటు అశ్వారావుపేట, సత్తుపల్లి మీదుగా వైరారోడ్డులో వచ్చే వాహనాలు రాపర్తినగర్ వద్ద సభికులను దించి, శ్రీశ్రీ సర్కిల్‌కు కొంత దూరంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వాహనాలను నిలిపివేయాలి.
- ఇల్లెందు రోడ్డులో వచ్చే వాహనాలు రాపర్తినగర్‌లో సభికులను దించాక మోగిలి పాపిరెడ్డి ఫంక్షన్‌హాల్ వెనుక భాగంలో పార్కింగ్ చేయాలి.
- వరంగల్, సూర్యాపేట రోడ్ల మార్గాల్లో వచ్చే వాహనాలు సభికులను జూబ్లిక్లబ్ వద్ద దించి ఎఫ్‌సీఐ పక్కన ఉన్న మేకల నారాయణ ఫంక్షన్‌హాల్ పక్కన ఖాళీ ప్రదేశం, బైపాస్ రోడ్డు నుంచి దానవాయిగూడెం వెళ్లే ప్రాంతంలో ఉన్న ఉషాహరి ఫంక్షన్‌హాల్ పక్కన ఖాళీస్థలం, రాపర్తినగర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ పక్క నుంచి వెళ్తే ఉండే ఎంపీ గాయత్రి రవికి చెందిన ఖాళీ సైట్‌లో వాహనాలను పార్కింగ్ చేయాలి.
- వాహనాల పార్కింగ్, రాకపోకలకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు అంబడిపూడి సుధాకర్ (9848582636), వజినేపల్లి శ్రీనివాసరావు (8187804416), మోటమర్రి జగన్‌మోహన్‌రావు (9948477260)లను ఫోన్‌లో సంప్రదించాల్సింగా సూచించారు.

శాస్త్రీయ నృత్య సమాహారం

ప్రజాశక్తి కల్చరల్



శాస్త్రీయ నృత్యం చేస్తున్న నృత్యకారులు

శాస్త్రీయ నత్య సమాహారంగా శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక బుధవారం అలరారింది. వైఎస్‌ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్, వైస్ మెన్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సంయుక్త నిర్వహణలో ఇండియన్ డాన్స్ ఫెస్టివల్ పేరిట భిన్న నృత్యాలు నర్తించారు. బెంగాల్‌కు చెందిన సుదీపా సైన్ సీల్, దేబ్ జానీ బసులు భరతనాట్యం, కుమార్ జోషి కథక్, రేణుక ప్రభాకర్, వినీల రావు, శిరీష, శ్రావ్య మృదుల కూచిపూడి నాట్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పర్వతీశం పాల్గొని మాట్లాడుతూ భిన్న నాట్యాలు ఒకె మాలికలా నర్తించి రసభరితం చేశారని ప్రశంసించారు. నాట్య గురువు పసుమర్తి శేషుబాబు మాట్లాడుతూ కూచిపూడి, భరత నాట్య కథక్ ప్రక్రియల విశేషాలను విశ్లేషించారు. కథక్ కళాకారుడు ఆంజి బాబు, నాట్య గురువులు నిర్మల ప్రభాకర్, డాక్టర్ సుమిత్రలతో వైఎస్‌ఆర్ మూర్తి భరత నాట్య కళాకారులు సుదీపాకు నాట్య మాధురి, జానీ బసుకు నాట్య ధురీన, జోషికి నాట్య శిఖర, రేణుకకు నాట్య విలసిని, వినీలకు నాట్య చతుర, శిరీష నాట్య కళా నిధి, శ్రావ్య మృదులకు నాట్య పరిమళ బిరుదులను బహుకరించారు.

'డాక్టరేట్లు డబ్బులకు అమ్ముకుంటున్న పరిస్థితి'

ప్రజాశక్తి కల్చరల్



డ్రైవర్‌బాబు డాక్టరయ్యాడు కథా సంపుటి ఆవిష్కరిస్తున్న వక్తలు

కొన్ని విశ్వవిద్యాలయాలు ఆలా చెలామణి అవుతున్న వ్యవస్థలు ఎనభై వేలకు లేదా ముప్పయి వేలకు డాక్టరేట్‌లు అమ్ముకునే పరిస్థితి వుందని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. డ్రైవర్ బాబు డాక్టరయ్యాడు కథలో రచయిత్రి ఈ వాస్తవాన్ని అద్దంలో చూపారని అభినందించారు. శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో పొత్తూరి జయ లక్ష్మి రచించిన డ్రైవర్ బాబు డాక్టరయ్యాడు కథా సంపుటి అవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని సంపుటిని అవిష్కరించి మాట్లాడారు. సంపుటిలోని కథలు సహజసిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఆధ్యాత్మిక వేత్త పులివర్తి కృష్ణ మూర్తి అధ్యక్షత వహించిన సభలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, కళా పోషకులు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కవి పెద్దూరి వేంకట దాసు నిర్వహణలో రచయిత్రి జయ లక్ష్మి తన సంపుటి ని భర్త పొత్తూరి సుబ్బారావుకు అంకితమిచ్చారు

రెసిడెన్షియల్ విద్యార్థుల ప్రతిభ భేష్

- నవలా రచన చేసిన విద్యార్థినులతో మంత్రి వేముల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

పేద పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా నాణ్యమైన విద్య అందాలన్నదే ముఖ్యమంత్రి కెసిఆర్ లక్ష్యమనీ, దానికి అనుగుణంగానే రాష్ట్ర వ్యాప్తంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు హైదరాబాద్‌లో జరుగుతున్న "హైదరాబాద్ బుక్ ఫెయిర్" ఎగ్జిబిషన్‌లోని 38వ నంబర్ స్టాల్‌లో తాము రచించిన పుస్తకాలను సందర్శనార్థం ఉంచారు. అది తెలిసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నవలా రచన చేసిన 12 మంది విద్యార్థినులను తన అధికారిక నివాసానికి ఆహ్వానించి ప్రత్యేకంగా అభినందించారు. వారితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారు రాసిన పుస్తకాలు చూసి, ప్రతిభను మెచ్చుకున్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్రంలో వెయ్యి రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీలు నెలకొల్పారని చెప్పారు. ఆడపిల్లల చదువుకు ఇబ్బంది కాకూడదని ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలు కొత్తగా నెలకొల్పారని వివరించారు. వారికి కాలేజీలో అందుతున్న విద్య, వసతిపై ఆరా తీశారు. భవిష్యత్‌లో మరింత రాణించాలని ఆకాక్షించారు. విద్యార్థినుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించిన ఇంగ్లీష్ లెక్చరర్ సంధ్య దీప్తిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, డిసిసిబి వైస్ చైర్మెన్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 15న వికలాంగుల చలో ఢిల్లీ

- వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఐక్య ఉద్యమాలు
- ఎన్‌పిఆర్‌డి అఖిలభారత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరీష్ కీర్తి, మురళీధరన్
- ముగిసిన ఎన్‌పిఆర్‌డి అఖిలభారత మూడో మహాసభ



మహాసభలో అభివాదం చేస్తున్న ఎన్‌పిఆర్‌డి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల పింఛన్ పెంచాలని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మార్చి 15న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని ఎన్‌పిఆర్‌డి జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరీష్ కీర్తి, మురళీధరన్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలోని సెయింట్‌మేరీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌పిఆర్‌డి జాతీయ మూడో మహాసభ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధరల పెరుగుదలకనుగుణంగా వికలాంగుల పింఛన్ పెంచాలన్నారు. 2019లో కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సమస్యలను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాలని అన్నారు. ప్రతి వికలాంగునికీ ఆహార భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ ట్రస్ట్ చైర్మెన్లను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద భావజాలాన్ని వికలాంగుల్లో జొప్పించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మహిళా వికలాంగులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల వల్ల వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ రంగాలను ప్రయివేటుపరం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తీర్మానాలు

- జాతీయ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. నూతన విద్యా విధానం రద్దు కోసం దేశవ్యాప్త ఉద్యమం చేయాలని మహాసభ తీర్మానించింది.
- ఉపాధి హామీ చట్టంలో ప్రత్యేక జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలి.
- వికలాంగులకు కేంద్ర ప్రభుత్వమే స్వయం ఉపాధి కల్పించాలి.
- బడ్జెట్లో ఐదు శాతం నిధులు వికలాంగుల సంక్షేమానికి కేటాయించాలి.
- ఆరోగ్య సౌకర్యం, పునరావాస సౌకర్యాలు కల్పించాలి.
- అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలి.
- సంక్షేమ పథకాలు అన్నింటిలో వికలాంగులకు 25 శాతం అదనంగా అవకాశాలు కేటాయించాలి.


రాష్ట్రపతికి సమ్మక్క సారలమ్మ చీరను అందజేస్తున్న ఆదివాసీ పూజారులు

రామప్ప శిల్ప సంపద అద్భుతం..

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

ములుగు జిల్లా రామప్ప శిల్ప సంపద ఎంతో అద్భుతంగా ఉందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. రామప్ప పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2.55 గంటలకు రామప్ప వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాష్ట్రపతి చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సైతో పాటు దేవాలయంలో రాష్ట్రపతి బృందానికి మంత్రులు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, జెడ్‌పి చైర్మెన్ జగదీశ్వర్, జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐటిడిఎ పిఒ అంకిత్ ఘన స్వాగతం పలికారు. అలాగే రామప్ప దేవాలయానికి చేరుకున్న ఆమెకు వేద పండితులు స్వాగతం పలికారు. కాగా రుద్రేశ్వరుడిని రాష్ట్రపతి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాష్ట్రపతి, గవర్నర్‌కు మేడారం సమ్మక్క సారలమ్మ సారే (చీర)ను మేడారం ఆదివాసీ పూజారులు అందజేశారు. ఆలయ విశిష్టత, నిర్మాణం, యునెస్కో గుర్తింపు కోసం తయారు చేసిన డోసియర్ వివరాలు, వరల్డ్ హెరిటేజ్ బాడీ విధించిన నిబంధనలు, తదితర అంశాలను రాష్ట్రపతికి కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ పాండురంగారావు వివరించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద రూ.62 కోట్లతో ప్రసాద్ స్కీం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్కృతిని చాటే విధంగా కొమ్ముకోయ కళాకారుల బృందం సమ్మక్క సారలమ్మ ప్రదర్శన, అన్నమాచార్య గీతంపై కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ముగించారు. సాయంత్రం 4.23 నిముషాలకు కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఎస్పీ సంగ్రామ్ సింగ్ రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు.

ఆరున స్కీమ్ వర్కర్ల నిరసనలు : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్కీమ్ వర్కర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా జనవరి ఆరో తేదీన దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపనున్నట్టు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ తెలిపారు. మన రాష్ట్రంలో ఎంపి ఇళ్ల ముందు, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆ నిరసనల్లో స్కీమ్ వర్కర్లు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యావసర సరుకుల ధరలు, మరోవైపు చాలీచాలని వేతనాలతో కేంద్రం, రాష్ట్రం ప్రవేశపెట్టిన స్కీమ్‌లలో పనిచేస్తున్న వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్లు పని చేస్తూ ఆ సంక్షేమ ఫలాలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు అందించడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం వారిని చట్ట పరిధిలోకి తీసుకురావడానికి నిరాకరించడం దారుణమని తెలిపారు. స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వారి సమస్యలపై సీఐటీయూ అనేక పోరాటాలు చేస్తున్నదని గుర్తుచేశారు. 2013 మే నెలలో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనమిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని చెప్పినా కేంద్రం విస్మరించడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

ఆర్‌అండ్‌బి రోడ్లు అద్దంలా ఉండాలి

- మంత్రి వేముల సమీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఆర్‌అండ్‌బి రోడ్లు అద్దంలా ఉండాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల ఆదేశించారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బి ప్రధాన కార్యాలయంలో ముఖ్యకార్యదర్శి శ్రీనివాస్‌రాజు, ఇంజినీర్ ఇన్ చీఫ్ రవీందర్‌రావుతో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత రెండు సీజన్లలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పిరియాడికల్ రెన్యూవల్, ఫ్లడ్ డ్యామేజ్ రోడ్ల కోసం ముఖ్యమంత్రి రూ. 2,500 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. కెసిఆర్ ఆదేశాల ప్రకారం వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పునరుద్ధరణ పనులు వేగంగా నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రోజు వరకు 70శాతం పనులకు టెండర్లు పిలిచామని ,దశలవారిగా అగ్రిమెంట్లు చేస్తున్నామని వివరించారు. మిగతా ప్రక్రియనూ జనవరి ఐదో తేదీలోగా పూర్తి చేసి జనవరి పది నుంచి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఇది వరకే వివిధ దశల్లో ఉన్న పనులను మార్చిలోపు పూర్తి చేయాలని కోరారు.

సిబిఐకి అప్పగిస్తే క్లీన్ చిట్ ఇచ్చినట్టా?

- మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సిబిఐకి అప్పగిస్తే నిందితులకు కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినట్టా? అని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్‌ఎల్‌పిలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, భూపాల్ రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సిబిఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొనడం అనుమానాలకు తావిస్తున్నదని తెలిపారు. ఈ కేసులు ఆ పార్టీ నేతలు నార్కోఅనాలిసిస్, లై డిటెక్టర్ పరీక్షలకు సిద్ధమా?అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

ఫాసిస్టు పరిస్థితుల్లో ప్రాణవాయువు

'కళ చెదరని స్వప్నం'

- ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కళ చెదరని స్వప్నం' అనే శీర్షికన ఇక్బాల్ రాసిన కవిత్వం ప్రస్తుత ఫాసిస్టు పరిస్థితుల్లో ప్రాణవాయువు లాంటిదని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. 35వ జాతీయ పుస్తక మహోత్సవంలోని అలిశెట్టి ప్రభాకర్ ప్రాంగణం వద్ద పాలమూరు అధ్యయన వేదిక నాగర్‌కర్నూల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.నారాయణ అధ్యక్షతన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ రాసిన 'కళ చెదరని స్వప్నం' పుస్తకాన్ని ప్రముఖ కవి కె.శివారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న హరగోపాల్ మాట్లాడుతూ రాజీలేనీ, సమాజం మారుతుందనే బలీయమైన విశ్వాసాన్ని ఆ కవిత్వం వ్యక్తం చేసిందన్నారు. అందరూ సమానంగా బతికే సమాజం వచ్చి తీరుతుందనే ఆశాభావాన్ని అది కలిగిస్తుందన్నారు. ఫాసిస్టు పరిస్థితులను చూసి భయపడే వారికి, ప్రజా పోరాటాల ముందు నియంతలు ఎక్కువ కాలం ఉండలేరనే సత్యాన్ని ఈ పుస్తకం గుర్తు చేస్తుందని చెప్పారు. తల్లిని, సమాజాన్ని, ఉద్యమాలను సమానంగా ప్రేమించిన కవి ఇక్బాల్ అని కొనియాడారు. కె.శివారెడ్డి మాట్లాడుతూ ఒక కవి ఎంత మేర, ఎంత బలంగా ప్రభావం చూపగలుగుతాడు? ఎంత మంది కవులను సృష్టించగలుగుతారనేది ఇక్బాల్ కవిత్వంతో తెలుస్తుందన్నారు. కవి స్కైబాబా మాట్లాడుతూ ఎన్ ఆర్‌సీ చట్టాలను కేంద్రం ఇంకా వెనక్కి తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికీ వాటి ప్రమాదం పొంచే ఉందని హెచ్చరించారు. కవి ఇక్బాల్ మాట్లాడుతూ లాక్‌డౌన్ కాలంలో చోటు చేసుకున్న మానసిక, సమాజ సంక్షోభం నేపథ్యంలో కళ చెదరని స్వప్నం రాశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ కె.రాఘవాచారి, సభ్యులు కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మంత్రితో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నేతలు

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

- మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు కెజికెఎస్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం (కెజికెఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లుతో పాటు సంఘం నేతలు ఎల్గూరి గోవిందు, వి. వెంకట నరసయ్య. బూడిద గోపి, ఎస్ రమేష్ గౌడ్, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, బోలగాని జయరాములు, బండకింది అరుణ్, గాలి అంజయ్య, పామనుగుల్ల అచ్చాలు తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇటీవల నీరా కేఫ్ కోసం చేస్తున్న కృషిని అభినందించారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసేందుకు నిర్ణయించటం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలను వారు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకుపోయారు. 560 జిఒ ప్రకారం సొసైటీలకు ఐదు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలనీ, కోటివరాల పథకంలో ఇచ్చిన భూములకు నీటి వసతి కల్పించి పొట్టి తాటి, ఈత, ఖర్జూర, జీనుగు మొక్కలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గీత కార్మికుల ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని, సభ్యులైన వారందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ఏడాదిలో మల్కాపూర్ కొత్త టెర్మినల్ పూర్తి

- చిత్తూరులో త్వరలో బాటిలింగ్ ప్లాంట్
- ఐఒసి ఇడి అనీల్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐఒసి ఇడి అనీల్ కుమార్

వచ్చే ఏడాది ముగింపు నాటికి పరదీప్- హైదరాబాద్ పైపులైన్ ప్రాజెక్టు పూర్తి కానుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎపి, తెలంగాణ హెడ్ బి అనీల్ కుమార్ తెలిపారు. ఇటీవలే ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనీల్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు విలువ రూ.3,338 కోట్లుగా ఉందన్నారు. దీనికి సంబంధించి నల్గొండలోని మల్కపూర్ నూతన టెర్మినల్ 2023 డిసెంబర్ ముగింపు నాటికి అందుబాటులోకి రానుందన్నారు. 1,212 కిలోమీటర్ల ఈ పైప్‌లైన్ ద్వారా ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఇంధనాల సరఫరా జరగనుంది. మల్కపూర్ టెర్మినల్‌ను రూ.611 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 2023 ఆగస్టు నాటికే ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉండగా.. భూ సమీకరణ ఆలస్యం కావడంతో ఆలస్యమయ్యిందన్నారు. తెలంగాణలో ఐఒసి 1425 రిటైల్ అవుట్‌లెట్‌లు కలిగి ఉందని అనీల్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రజల అవసరాలను తమ చర్లపల్లి, రామగుండం టెర్మినళ్లు తీర్చగలవన్నారు. తెలంగాణలోని పెట్రోల్ విక్రయాల్లో 34.6 శాతం, డీజిల్‌లో 38 శాతం, ఎల్‌పిజిలో 40 శాతం చొప్పున ఐఒసి వాటాలు కలిగి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో సిఎన్‌జికి సంబంధించి 46 రిటైల్ అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. మరో 21 సిఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్లను అందుబాటులోకి తేనున్నామన్నారు. చిత్తూరులో మరో మూడు మాసాల్లో బాటిల్లింగ్ ప్లాంట్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు.

టెక్స్‌టైల్ రంగానికి నిధులు కేటాయించండి

- జిఎస్‌టి రద్దు చేస్తూ బడ్జెట్‌లో ప్రకటించాలి
- కేంద్రానికి మంత్రి కెటిఆర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ టెక్స్‌టైల్ రంగానికి భారీగా నిధులు కేటాయించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి కె.తారక రామారావు కేంద్రాన్ని కోరారు. బిజెపి సర్కారు చివరిసారిగా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో జిఎస్‌టిని రద్దు చేస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. నేతన్నల సంక్షేమం, ఆ రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఆర్థిక మంత్రులు మారుతున్నా.... కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అందుతున్నది శూన్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, సిరిసిల్ల మెగా పవర్‌లూమ్ క్లస్టర్‌కి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బ్లాక్ లెవెల్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌ల ఏర్పాటుకు నిధులివ్వాలనీ, తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, నేషనల్ టెక్స్‌టైల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఏర్పాటుపై ప్రకటన చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాల లేమి, మౌలిక వసతుల కల్పన వైఫల్యంతో మేక్ ఇన్ ఇండియా కేవలం నినాదంగా మాత్రమే మిగిలిపోయిందని విమర్శించారు. బంగ్లాదేశ్, శ్రీలంక వంటి చిన్న దేశాలతోనూ పోటీ పడలేని పరిస్థితిలో భారతదేశం ఉండడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్స్‌టైల్, నేతన్నల పరిస్థితులపై మోడీ సర్కార్‌కు కనీస అవగాహన, చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి మోడీ సర్కార్ చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. ఈ మేరకు కెటిఆర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కును కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో ఏర్పాటుకు సుమారు రూ.1,600 కోట్లు ఖర్చవుతున్నదని ఆయన తెలిపారు. ఈసారి బడ్జెట్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మౌలిక వసతులు కల్పన, ఇతర కార్యక్రమాల కోసం కనీసం రూ.900 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పన, పాలసీ ప్రోత్సాహకాలు లేకుంటే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మేకిన్ ఇండియా ఒక నినాదంగా మాత్రమే మిగిలిపోతుందని స్పష్టం చేశారు. సిరిసిల్ల పవర్లూమ్ క్లస్టర్‌ను మెగా పవర్లూమ్ క్లస్టర్‌గా గుర్తించి, ఈ ప్రాజెక్టు కోసం కనీసం రూ.100 కోట్లు సాయం చేయాలని కోరారు. సిరిసిల్ల మరమగ్గాల ఆధునికీకరణ, వాల్యూ చైన్ బలోపేతం, మార్కెట్ అభివృద్ధి, నైపుణ్య అభివృద్ధి, కెపాసిటీ బిల్డింగ్, ప్రాజెక్ట్ మానిటరింగ్ వంటి ఖర్చుల కోసం సుమారు రూ.990 కోట్లు అవసరమవుతాయని వివరించారు. ఇందులో సింహభాగాన్ని ఈ బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి కెటిఆర్ విజ్ఞప్తి చేశారు.

ఇందుకు సంబంధించి గుండ్ల పోచంపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాలో అవసరమైన స్థలం అందుబాటులో ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. దీంతోపాటు నేషనల్ టెక్స్‌టైల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హ్యాండ్ లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఏర్పాటును రాబోయే బడ్జెట్‌లో ప్రకటించాలని కోరారు. ప్రస్తుతమున్న 20 లక్షల జిఎస్‌టి స్లాబ్‌ను చేనేత, పవర్లూమ్ కార్మికులకు రూ.50 లక్షల వరకు పెంచాలన్నారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సారంపల్లి మల్లారెడ్డి

చరిత్రను సమగ్రంగా రాస్తేనే భావితరాలకు దిక్సూచి

- 'ఎఐకెఎస్ సంక్షిప్త చరిత్ర' పుస్తకావిష్కరణలో సారంపల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చరిత్రలో ఎన్నో ఘటనలు జరిగాయనీ, వాటిని అన్ని పుస్తకాల్లో పొందుపరచలేదని రైతు సంఘం జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. చరిత్రను సమగ్రంగా రాస్తేనే భావితరాలకు పుస్తకాలు దిక్సూచిగా నిలుస్తాయని తెలిపారు. చరిత్రను అందరూ రాస్తారుగానీ అది అంత తేలికైన పని కాదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లోని అలిశెట్టి ప్రభాకర్ వేదికపై బుధవారం ఎఐకెఎస్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి హన్నన్‌మొల్లా రచించిన 'ఎఐకెఎస్ సంక్షిప్త చరిత్ర' అనే పుస్తకాన్ని సారంపల్లి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సారంపల్లి మాట్లాడుతూ చరిత్ర పుస్తకాలను వర్గ దృష్టితో రాయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రానైట్ పరిశ్రమ ద్వారా చైనా, రష్యా తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్న విషయాన్ని రాస్తూనే... గ్రానైట్ భూనిర్వాసితులు, కార్మికుల వేతనాలు, ప్రమాదంలో మరణించిన కార్మికుల జీవితాలు, వారి దుర్భర పరిస్థితులను రాస్తేనే అది సమగ్ర చరిత్ర అవుతుందంటూ ఉదాహరించారు. చరిత్ర ఏకపక్షంగా ఉండకూడదని అభిప్రాయపడ్డారు. 1920 కంటే ముందు ఫకీర్లు బ్రిటీష్ పాలకులతో తెగించి పోరాడినా.. ఆ పోరాటాన్ని చరిత్రలో లిఖించలేదన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. రైతాంగ ఉద్యమాల చరిత్రను ఏఐకేఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సదానంద సరస్వతి, ప్రస్తుత జాతీయ అధ్యక్షులు అశోక్‌ధావలే రాశారని గుర్తు చేశారు. అటువంటి చరిత్రపై ఇప్పుడు దాడి జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలనీ, ముఖ్యంగా భారత స్వాతంత్ర్యోదమ చరిత్రను చదవాలని సూచించారు.

కమ్యూనిజం అజేయం

'అరుణతార అరిబండి' పుస్తకావిష్కరణలో జూలూరి గౌరిశంకర్

ప్రపంచంలో కమ్యూనిజం అజేయమనీ, ఎందుకంటే అది పచ్చి నిజమని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు, తెలంగాణ సామితి అకాడమీ చైర్మన్ జూలూరి గౌరి శంకర్ అన్నారు. కమ్యూనిజానికి ప్రస్తుతం అదరణ లేదనే ప్రచారాన్ని చేస్తున్నారనీ, దోపిడీ, దౌర్జన్యం, వివక్ష, సామాజిక అసమానతలు ఉన్నంత కాలం ఎర్రజెండాకు తిరుగులేదన్నారు. ఆనంగారి భాస్కర్ రచించిన 'అరుణతార అరిబండి' అనే పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో బుధవారం జూలూరి ఆవిష్కరించారు. రైతు సంఘం నాయకులు, సిపిఎం మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. సిపిఎం మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డితో కలిసి అరిబండి అసెంబ్లీలో చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి, ధర్మబిక్షం తమ జీవితాలను త్యాగం చేశారంటూ స్మరించుకున్నారు. భూస్వామ్య వ్యవస్థను రద్దు కోసం అనేక పోరాటాలు చేశారని చెప్పారు. 'బండెనక బండి కట్టి' అనే పాట పేద ప్రజలను ఉద్యమాలవైపు నడిపించిందన్నారు. నేటి పరిస్థితుల్లో అక్షర యుద్ధం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, పి జంగారెడ్డి, అరిబండి ట్రస్టు కార్యదర్శి డాక్టర్ అరిబండి మనోహర్, డాక్టర్ అరిబండి అనిల్ పాల్గొన్నారు.

పద్మశ్రీ భాష్యం విజయసారధి ఇకలేరు

- సంస్కృత సాహిత్యంలో ఎనలేని కృషి
- 16వ యేటనే శబరి పరిదేవనం, మనోరమ రచనల ఆవిష్కరణ
- దేశసమగ్రతను ప్రతి పౌరుడూ కాపాడాలని స్ఫూరించిన రచనలు
- భాష్యం మరణం పట్ల ముఖ్యమంత్రి సహా మంత్రుల నివాళి


విజయసారథి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీభాష్యం విజయసారథి(86) బుధవారం తుదిశ్వాస విడిచారు. కరీంనగర్ జిల్లా కేంద్ర సమీపంలోని చేగుర్తి గ్రామానికి చెందిన ఆయన కొంత కాలంగా కరీంనగర్‌లోనే నివాసముంటున్నారు. 1936, మార్చి 10న నరసింహాచార్యులు, గోపమాంబ దంపతులకు జన్మించిన ఆయన తన ఏడో ఏట నుంచే పద్య రచన ప్రారంభించారు. తల్లి ద్వారా నేర్చుకున్న సంస్కృతిక పాండిత్యాన్ని తన కలం ద్వారా పండించిన విజయసారథి ప్రాథమిక విద్యాభ్యాసం ఉర్దూ మీడియంలో సాగినప్పటికీ సంస్కృత పండితునిగా ప్రతిభ కనబరిచారు. పదకొండో ఏటనే శారదా పదకింకిణి, 16వ ఏట శబరి పరిదేవనం, 17 ఏట మనోరమ రచించారు. మందాకిని కవిగా మన్ననలు పొందిన ఆయన వందకుపైగా సోత్రాలు, సుప్రభాతాలు, దేశభక్తి రచనలు, అధిక్షేప కవితలు, ఆప్త లేఖ, ఖండకావ్య పరంపర, అనువాద రచనలు, వర్ణన కావ్యాలు రచించారు. దేశ స్వాతంత్ర్య సమగ్రతను పరిరక్షించడం కోసం ప్రతి పౌరుడూ పాటుపడాలని సూచించారు. ఆయన అఖిల భారత స్థాయిలో ముంబయి, కోల్‌కత్తా, నాగపూర్, ఢిల్లీ వంటి అనేక నగరాల్లో కవి సమ్మేళనాల్లో పాల్గొన్నారు. 30 ఏళ్లుగా మానేరునది తీరాన కరీంనగర్లో బొమ్మకల్ రోడ్లో యజ్ఞవరాహ క్షేత్రాన్ని ఏర్పాటు చేసి వేదాల్లోని మౌలిక జ్ఞానాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆయనకు తెలంగాణ సంస్కృత వాచస్పతిగా పేరుంది. వీరి సాహిత్య కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం 2020లో పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. అంతకు ముందు స్వర్ణకంకణం, క్రియేటివ్ సాంస్క్రిట్ పోయెట్, ఉత్తమ సంస్కృతిక పండితులుగా (తెలుగు విశ్వవిద్యాలయం) బిరుదులు పొందారు. 2017లో తెలంగాణ రాష్ట్ర విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఇలా అనేక అవార్డులు, బిరుదులు అందుకున్న ఆయన వాఖ్యానమూర్తిగా పేరొందారు. ఆయన మరణం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రులు సంతాపం తెలిపారు. మంత్రి గంగుల కమలాకర్ స్వయంగా ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సహా జిల్లా సాహిత్యకారులు శ్రీభాష్యం భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

శ్రీ భాష్యం మరణం పట్ల సిఎం సంతాపం

సుప్రసిద్ధ సంస్కృత భాషా పండితుడు పద్మశ్రీ భాష్యం విజయసారథి మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. ఆయన మరణం దేశ సంస్కృత భాషా పాండిత్యానికి తీరనిలోటని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీభాష్యం సాహితీ రంగానికి చేసిన సేవలను సిఎం కెసిఆర్ స్మరించుకున్నారు.

కవిత్వ సృజనతోపాటు, రాగయుక్తంగా కవిత్వాలాపన చేయడంలో గొప్ప ప్రతిభను ప్రదర్శించేవారనీ, వర్తమాన కవులకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. శ్రీభాష్యం కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ కూడా విజయసారథి మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

నేటి ఖమ్మం బహిరంగ సభను జయప్రదం చేయండి

- వ్యకాస రాష్ట్ర కార్యాలయంలో పతావిష్కరణ చేసిన జి నాగయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కేంద్రంలో 29 నుంచి 31 వరకు తమ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ జరుగబోతున్నాయని, ఆ సందర్భంగా గురువారం ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య పిలుపునిచ్చారు. ఆ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని నాగయ్య ఎగురవేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభల నేపథ్యంలో అన్నిజిల్లాల్లో తమ సంఘం ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రంలో 56 లక్షల కమతాలున్నాయని, సాగులో కౌలు, సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల గిట్టుబాటు ధర ఎక్కడా లభించడం లేదనీ, రైతులు వ్యవసాయం చేయలేని దుస్థితి నెలకొందని తెలిపారు. వ్యవసాయ పనులపైనే ఆధారపడి జీవిస్తున్న కూలీల పరిస్థితి మరింత దారుణంగా తయారైందని వాపోయారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతోందని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం కోసం, వ్యవసాయ కూలీల పెంపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేయాల్సిన పోరాటాలకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణను రాష్ట్ర మహాసభలో తీసుకుంటామని చెప్పారు.

ఈ బహిరంగ సభలో వ్యవసాయ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా కూలీల రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ బి.పద్మ, ఆ సంఘం నాయకులు ఆర్ ఆంజనేయులు, సాయిజీ పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాగయ్య